క్లుప్తంగా

ఎంఏఎం అధ్యాపకుడికి డాక్టరేట్



నరసరావుపేట రూరల్: కేసానుపల్లి ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో అధ్యాపకునిగా పని చేస్తున్న తూనుగుంట్ల భవాని రమేష్ కుమార్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలో డాక్టరేట్ డిగ్రీ పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు గురువారం తెలిపారు. డయాబెటిస్ మిల్లిటస్ వ్యాధి తీవ్రత, దాని దుష్ఫలితాలు, చికిత్స విధానంపై మధ్యప్రదేశ్‌లోని సత్యసాయి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మెడికల్ సైన్సెస్‌కు సమర్పించిన పరిశోధన పత్రానికి డాక్టరేట్ డిగ్రీ లభించినట్లు వివరించారు. డాక్టరేట్ పొందిన భవాని రమేష్ కుమార్‌ను కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

డీపీఎం అమలకుమారి



నాదెండ్ల: ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించటమే కాకుండా భూసారాన్ని మెరుగు పరచి అధిక దిగుబడులు సాధించవచ్చని డీపీఎం కె.అమలకుమారి చెప్పారు. యడ్లపాడు మండలం కొండవీడు కోట గ్రామంలో రైతు సయ్యద్ ఫరూక్‌కు చెందిన పత్తి పొలాన్ని ఆమె పరిశీలించారు. రైతు ఫరూక్ ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తూ, అంతరపంటలుగా పెసర, మినుము, చిక్కుడు, అలసందలు, సరిహద్దు పంటలుగా మొక్కజొన్న వేసుకోవటం, ఘన , ద్రవ జీవామృతం వినియోగిస్తున్న తీరును పరిశీలించారు. రసాయనిక ఎరువులు, పురుగుమందులను ఏ మాత్రం వినియోగించకుండా పత్తి పండించటం ద్వారా నాణ్యమైన పత్తి దిగుబడులు వచ్చి సుస్థిర ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఈపూరు జెడ్పీ పాఠశాలలో మాక్ పోలింగ్



ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దేశ అప్నా మెన్ సహాయోగ్ ఫౌండేషన్ (డీఏఎస్ఎఫ్) ద్వారా పాఠశాలలో యాక్టిజన్ క్లబ్ నిర్వహించుటకు 6వ తరగతి విద్యార్థులకు మాక్ పోల్ గురువారం నిర్వహించారు. ఈ మాక్ పోల్‌లో 6వ తరగతి నుంచి ఆరుగురు అభ్యర్థులు పోటీల్లో పాల్గొనడం జరిగింది. వారిలో అత్యధికంగా కె.గోపిరాజుకు 42 ఓట్లకు గాను 16 ఓట్లు వచ్చినందున అతని యాక్టిజన్ క్లబ్ ఆఫీస్ బేరర్‌గా నియమించినట్లు తెలిపారు.

న్యాయమూర్తి వసతి గృహం సందర్శన



సత్తెనపల్లి: పట్టణంలోని రఘురామ్‌నగర్‌లోని బీసీ బాలికల వసతి గృహాన్ని సత్తెనపల్లి సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్), మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ సీహెచ్ నాగ వెంకట శ్రీనివాసరావు, సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్ గురువారం సందర్శించారు. విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆహార పదార్థాల నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. స్వయంగా ఆహార పదార్థాలను రుచి చూసి, నాణ్యతను పరిశీలించారు. ప్యానల్ న్యాయవాది బీఎల్ లక్ష్మీ కోటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

ముప్పాళ్ళ: గ్రామాల్లో పట్టభద్రులను గుర్తించి వారంతా ఓటు హక్కు పొందేలా చూడాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీ ప్రసాదు చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటు హక్కుపై బీఎల్వోలతో గురువారం సమావేశం నిర్వహించారు. 2021 నవంబర్ 1 నాటికి డిగ్రీ పూర్తైన వారు అర్హులని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. నవంబర్ 6తో గడువు ముగుస్తుందన్నారు. బీఎల్‌ఓలు గ్రామాల్లో అవగాహన కల్పించి, పట్టభద్రులందరూ ఓటు హక్కు పొందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల వీఆర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



గోతులమయంగా మారిన రైల్వేస్టేషను రోడ్డు





కారంపూడి మార్గంలో నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పడిన భారీగోతులు

రహదారులా ఇవి?

- నరకానికి నకళ్లుగా మారిన వినుకొండలో రోడ్లు
- పట్టణంలో ప్రమాదభరితంగా మారిన వైనం
- ప్రధాన సెంటర్లన్నీ గోతులమయమే
- ఆర్టీసీ, రైల్వేస్టేషన్లకు వెళ్లాలంటే నరకమే
- తరచూ ప్రమాదాలతో భయపడుతున్న వాహన చోదకులు
- ఉలుకు–పలుకులేని అధికారులు, ప్రజాప్రతినిధులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణం ప్రధాన సెంటర్ల రహదారులపై భారీగోతులు ఏర్పడటంతో ప్రజలు రోడ్లపై ప్రయాణించాలంటేనే వణికిపోతున్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతుండటంతో పట్టణ ప్రజలు నరకయాతన పడుతున్నారు. ప్రధాన రహదారుల పరిస్థితి చెప్పనవసరం లేదు. కనీసం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో కూడా గోతులు పూడ్చేవారు కరువైపోవడంతో వినుకొండ ప్రజలకు మాత్రం కష్టాలు తప్పడంలేదు. పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్ సెంటరు, కారంపూడి రోడ్డు, శియ్యస్తూపం సెంటరు, ప్రభుత్వ వైద్యశాల, రైల్వేస్టేషను రోడ్డు వంటి రద్దీగా ఉండే రోడ్లపై మోకాళ్లలోతు గోతులు ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడేలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడిన సమయాల్లో గోతుల్లో నీరునిండి పోయి ఎంతలోతు ఉంటుందో తెలియక పోవటంతో ప్రతినిత్యం ప్రమాదాలు జరుగటం పరిపాటిగా మారింది. అటు మున్సిపల్ శాఖ, ఆర్అండ్‌బీ, శాఖలవారు ఎవరూ ఈ గోతులపై దృష్టి సారించకపోవటంతో ప్రజలకు నిత్యం కష్టాలు తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని ప్రధాన సెంటర్లలో రోడ్డు గుంతలు ఏర్పడి రోజురోజుకూ పెరిగిపోయాయాయి. రోడ్డుపై ప్రయాణించాలంటే ఎటూ తప్పించుకునే వీలులేకుండా గోతుల్లోనే ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. నిత్యం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, దూర ప్రయాణాలు చేసే ప్రయాణికులు ఆర్టీసీ సెంటరుకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఏ గోతివల్ల ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన పట్టణ వాసులను వెంటాడుతోంది. ఆటోలు ద్విచక్ర వాహనాలు, రిక్షాలు వంటి చిన్నపాటి వాహనాలు నడపాలంటే కత్తిమీద సాములాగా మారిందని వాహన చోదకులు వాపోతున్నారు. పట్టణంలోని కొత్తపేట, గాయత్రీనగర్, రెడ్డినగర్, సీతయ్యనగర్, రైలుపేట, విష్ణు కుండిన నగర్, వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే గుంతలు తగలకుండా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధాన సెంటర్లలో ఇలాంటి ప్రమాదకరమైన గోతులు ఉన్నప్పటికీ అటు, ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు పట్టించుకోకపోవటంపై ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు.

రహదారులు దారుణం



ఇటీవల కాలంలో పట్టణంలో ప్రధాన రోడ్లు మొత్తం గుంతలమయంగా మారాయి. రోడ్డుపై ప్రయాణించాలంటేనే భయంగా ఉంది. పల్నాడు రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ సెంటరు, ప్రభుత్వ వైద్యశాల, రైల్వే స్టేషను రోడ్లు మరీ దారుణంగా తయారయ్యాయి. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేయించాలి.

–మాటా సత్యం వినుకొండ

ప్రయాణమంటే భయమేస్తోంది



పట్టణంలో రోడ్లు దారుణంగా తయారయ్యాయి. ద్విచక్ర వాహనాలు కూడా తిరగలేని పరిస్థితి. వర్షాలకు రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. విద్యార్థులు, ప్రయాణికులు, రోడ్లపై తిరగాలంటేనే భయంగా ఉంది. అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్లను బాగు చేయాలి.

–బేతం గాబ్రియేలు, మున్సిపల్ వైస్ చైర్మన్

మరమ్మతులు చేయిస్తా

ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పాడయ్యాయి. మరమ్మతులు చేసేందుకు అనుమతులు ఉన్నాయి. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో పనులు ఆపివేశాం. త్వరలోనే రోడ్లుకు మరమ్మతులు చేయిస్తాం.

–గణేష్, ఏ.ఈ.ఈ, ఆర్ అండ్ బీ

అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ముప్పాళ్ల విద్యార్థి



ఈపూరు: మండలంలోని ముప్పాళ్ల ధనలక్ష్మీ వ్యాయామ కళాశాలకు చెందిన ఎంపీఈడీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి గన్నేపల్లి చినబాబు అక్టోబరు నెలలో బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకటరావు గురువారం తెలిపారు. ఇటీవల గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన పోటీల్లో చినబాబు ఎంపికైనట్లు వివరించారు. సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తరపున పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బి.నాయక్, ఎం.దాస్, సీహెచ్. అరవింద్, కె.వంశీ తదితరులు అభినందించారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీ

శావల్యాపురం: మండలంలోని శానంపూడి గ్రామంలో ప్రధాన పాఠశాల, ఎస్సీ కాలనీలో ఎంపీపీ పాఠశాలలను ఎంఈవో మద్దికుంట సాంబశివరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన గుణాత్మక విద్యను బోధించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అనంతరం పాఠశాలల్లో రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులు దిశ నిర్దేశం చేశారు. ఆయనతో పాటు ప్రధానోపాధ్యాయులు గుడ్లూరి ప్రసాదు, కొండలరావు ఉన్నారు.

ఎమ్మార్పీ ధరలకే అమ్మకాలు చేయాలి

ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు



మద్యం సీసాను పరిశీలిస్తున్న సీఐ దేవర శ్రీనివాసరావు

శావల్యాపురం: మద్యం షాపుల్లో ఎమ్మార్పీ ధరలకే అమ్మకాలు చేయాలని వినుకొండ ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక మద్యం షాపును ఎక్సైజ్ పోలీసులు సందర్శించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ వినుకొండ అర్బన్, రూరల్, నూజెండ్ల, శావల్యాపురం మండలంలో 14 మద్యం షాపులు ఉన్నాయని ప్రభుత్వ నిబంధనలు మేరకు ఫిర్యాదులు తావు లేకుండా మద్యం సీసాలు ఎమ్మార్పీ ధరలకు అమ్మకాలు పారదర్శకంగా చేయాలన్నారు. అన్నీ రకాల కంపెనీలకు చెందిన మద్యం సీసాలు అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. రూ. 99 రూపాయలు మద్యం సీసా షాపుల్లో అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి అమ్మకాలు జరిపితే అటువంటి షాపులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధలను మేరకు షాపులు సమయాభావం పాటించాలన్నారు. అన్నీ షాపుల ప్రాంగణంలో ఎమ్మార్పీ ధరలకే అమ్మకాలు జరపాలంటూ ఫెక్సీలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం షాపులో రూ. 99 రూపాయల మద్యం సీసాను పరిశీలించి షాపు నిర్వాహకుడికి సూచనలు చేశారు.

పేటీఎం మిషన్లతో స్త్రీనిధి రుణాల చెల్లింపులు

జిల్లా స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజరు రంతు చిన బుల్లియ్య



పేటీఎం మిషన్లు అందజేస్తున్న వెలుగు కార్యాలయం అధికారులు

శావల్యాపురం: స్త్రీనిధి రుణాలు చెల్లింపులకు పేటీఎం మిషన్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజరు రంతు చిన బుల్లియ్య సూచించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామ సమాఖ్య సంఘాలకు పేటీఎం మిషన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో స్త్రీనిధి రుణాలు రూ.120 కోట్లు 24 వేల మంది మహిళా సంఘాల్లోని సభ్యులకు ఇవ్వడానికి లక్ష్యంగా ఎంచుకోగా ఇప్పటి వరకు 2640 మంది సభ్యులకు రూ.19 కోట్ల 50 లక్షల రుణాలను పారదర్శకంగా అందజేశామన్నారు. స్త్రీనిధి రుణాలు చెల్లింపులో అవకతవకలకు తావులేకుండా ఉండటానికి నగదు రహిత అర్థిక లావాదేవీలు నిర్వహించడానికి ఒక్కో మండలానికి 10 పేటీఎం మిషన్లు గ్రామ సమాఖ్య సంఘాలకు అందజేస్తున్నట్లు తెలిపారు. స్త్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించాలని అలాగే నగదు చెల్లింపులు చేయగానే రసీదులు తీసుకోవాలన్నారు. అనంతరం మహిళా సంఘాల్లోని సభ్యులకు పేటీఎం మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయం జి.వాసుబాబు, సీసీ ఖాజావలీ మహిళా సభ్యులు ఉన్నారు.

వేర్వేరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

గౌరిపోలు సదస్సుకు 45 అర్జీలు



గౌరిజపోలులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఏవీ రమణ

నాదెండ్ల: మండలంలోని గౌరిజపోలు సచివాలయం వద్ద గురువారం గ్రామ రెవిన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచ్ గొర్రెపాటి గృహలక్ష్మీ, తహసీల్దార్ ఏవీ రమణ, డీటీ ధనలక్ష్మీ, సర్వేయర్ రాంబాబు పాల్గొన్నారు. భూముల రీసర్వే పూర్తయి భూ విస్తీర్ణంలో వ్యత్యాసాలు ఉన్నాయంటూ 45 మంది రైతులు అర్జీలు అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఏవీ రమణ మాట్లాడుతూ రైతుల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి త్వరలో సర్వే ద్వారా పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో రాధాకృష్ణ, గ్రామ సర్వేయర్ మధుబాబు పాల్గొన్నారు.

పిచికలపాలెంలో..

శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం గ్రామంలో రెవెన్యూ గ్రామసభ గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు వేముల వెంకట నాగరాజు పాల్గొని మాట్లాడుతూ రీసర్వే పనులు పూర్తయిన గ్రామాల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే రైతుల నుంచి లిఖిత పూర్వకంగా అర్జీలు తీసుకుంటున్నట్లు తహసీల్దారు తెలిపారు. అర్జీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ గ్రామసభలో సర్పంచ్ గణపర్తి ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దారు పేరిసోముల నాసరయ్య, మండల సర్వేయర్ యం.రాజు, వీఆర్వో రవి, రైతులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని 15వ వార్డు ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు గొంట్ల వెంకమ్మ, రంగయ్యల మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్నులను జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు జి. కమలారామ్ అందజేశారు. గత 18 సంవత్సరాలుగా సంవత్సరానికి ఒక్కో పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు నాగరాజు, కోటేశ్వరరావు, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు నిర్వహించాలి

శావల్యాపురం: జాబ్ కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్స్‌లపై ఉందని ఎంపీడీవో పేరమీనా సీతారామయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో శావల్యాపురంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు పారదర్శకంగా నిర్వహించాలని ఉపాధి అధికారుల సూచనలు మేరకు కూలీ రోజుకు రూ. 290 వేతనం మంజూరు అవుతుందన్నారు. అనంతరం పంట కాల్వ పూడికతీత పనులను పరిశీలించి కూలీలకు సూచనలు చేశారు. ఆయనతో పాటు ఏపీవో కె.రామారావు, ఫీల్డ్ అసిస్టెంట్ చెరూకూరి బాలకృష్ణ ఉన్నారు.

వ్యాక్సినేషన్ కాని పిల్లలను గుర్తించాలి

రాజుపాలెం: మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఇప్పటి వరకు టీకాలు వేయించుకోని ఐదేళ్ల లోపు పిల్లలను గుర్తించాలని డాక్టర్ కేవీ కృష్ణకుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు హెడ్ కౌంట్ సర్వే సెన్సిటైజేషన్ రియోరియంటేషన్ శిక్షణ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాట్లాడుతూ సర్వే ఫాంలు తప్పులు, తడక లేకుండా పూర్తిచేయాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోని పిల్లలను ఖచ్చితంగా గుర్తించాలని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్లు జీవన్‌రావు, ఉషారాణి, ఉన్నారు.

ఆరంతస్తుల నిర్మాణం.. తొలగించండి

ఏవోకు ప్రజాసంఘాల వినతి



నరసరావుపేట: నిబంధనలకు విరుద్ధంగా స్టేషన్ రోడ్డులోని ఆర్డీవో కార్యాలయానికి ఎదురుగా నిర్మాణమవుతున్న ఆరంతస్తుల బిల్డింగ్‌ను తొలగించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆరు అంతస్తుల బిల్డింగ్ ప్రభుత్వ నిబంధనలకు భిన్నంగా నిర్మాణం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నిర్మాణం చేసేవాళ్లు, వినుకొండ రోడ్డులో నవయుగ లాడ్జింగ్, రెస్టారెంట్, కోటప్పకొండ రోడ్డులో కల్యాణ మండపం నిర్మాణం చేసి పార్కింగ్ స్థలం లేకుండా చుట్టుపక్కల వాహనదారులకు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తున్నారన్నారు. వీరిపై చర్యలు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను తొలగించాలని కోరారు. దీంతో పాటు పట్టణంలోని పలుచోట్ల నిర్మాణంలో ఉన్న అక్రమ నిర్మాణాలు, కట్టడాలు, పార్కింగ్ ప్లేసులు లేని వాటిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పీడీఎం రాష్ట్ర నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, పౌర హక్కుల సంఘం జిల్లా జాయింట్ సెక్రెటరీ శికినం చిన్న, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కోట నాయక్, బీసీ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, సురభి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వేతనాలు, సెలవులు అమలు చేయాలి

ధర్నా చేసిన మున్సిపల్ కార్మికులు



ధర్నా చేస్తున్న కార్మికులు

నరసరావుపేట: మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులకు స్కిల్లు, సెమిస్కిల్లు, అన్‌స్కిల్డ్ వేతనాలు, వారాంతపు, పండగ సెలవులు ఇవ్వకపోవడం అన్యాయమని, వాటిని వెంటనే అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షుడు సిలార్ మసూద్ డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయం, ఇంజనీరింగ్ కార్మికుల మచ్చర్ పాయింట్ వద్ద ధర్నా చేశారు. కార్మికులకు జీతాలతో పాటు ఎనిమిది గంటల పనిదినం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షుడు షేక్ చిన్న అల్లాభక్షు, కార్యదర్శి సోమశేఖర్, కుంచాల శ్రీను, బాలాజీ సింగ్ నాయకత్వం వహించారు.

రిలేదీక్షా శిబిరానికి సంఘీభావం

రాజకీయ కారణాలతో టీడీపీ కూటమి నాయకులు అన్యాయంగా తొలగించిన ఇంజనీరింగ్ విభాగ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం వారు మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా రిలేదీక్షలు చేస్తున్న శిబిరాన్ని సందర్శించి వారికి తమ సంఘీభావం తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అందరూ ఒకేపార్టీలో ఉండాలనే నిబంధన ఏదీ ఉండదన్నారు. ఎవరికి తోచిన పార్టీలో వారు ఉంటారని, వారు తమ పార్టీవారు కాదనే ఉద్దేశ్యంతో విధుల నుంచి చిరుద్యోగులను తొలగించటం దారుణమన్నారు. వెంటనే విధుల్లోకి తీసుకొని వారికి న్యాయం చేయాలని కోరారు. పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జి.రామకృష్ణ, పౌరహక్కుల సంఘ జిల్లా కార్యదర్శి శికినం చిన్న పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించాలి

జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారిణి నీలావతి



నీలావతిని సత్కరిస్తున్న హెచ్ఎం విజయభారతి

నాదెండ్ల: ప్రస్తుత విద్యా సంవత్సరంలో నూరుశాతం ఫలితాలు సాధించే దిశగా అదనపు తరగతులు, అంతర్గత పరీక్షల నిర్వహణపై శ్రద్ధ పెట్టాలని పల్నాడు జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారిణి ఎం.నీలావతి చెప్పారు. యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని మొదటి, ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు బోధిస్తున్న తీరును పరిశీలించారు. అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగుల సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీపంలోని గణపవరం సీఆర్ కాలేజీ, చిలకలూరిపేటలోని ఏఎంజీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. స్వంత ఖర్చులతో విద్యార్థినులకు యూనిఫాం అందించిన పీజీటీ టీచర్లను ఆమె అభినందించారు. అనంతరం ఆమెను హెచ్ఎం విజయభారతి, ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు.

పల్స్ పోలియోపై అవగాహనకు శ్రీకారం

ఆటోలపై స్టిక్కర్లు అంటించిన రోటరీక్లబ్, ట్రాఫిక్ పోలీసు ప్రతినిధులు



పట్టణంలోని గడియారం స్తంభం సెంటర్‌లో ఆటోలపై స్టిక్కర్లు అంటిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

నరసరావుపేట: వరల్డ్ పల్స్ పోలియో డే సందర్భంగా నరసరావుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై అవగాహన కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. అప్పుడే పుట్టిన పసికందు నుంచి ఐదేళ్ల చిన్నారులకు రెండు చుక్కల డ్రాప్స్ ప్రతి ఏడాది వేయాలని ప్రజలకు గుర్తు చేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు పట్టణంలోని గడియారం స్తంభం సెంటర్‌లో ఆటోలపై స్టిక్కర్లు అంటించే కార్యక్రమం నిర్వహించారు. రోటరీ క్లబ్ మాజీ గవర్నర్లు కేపీ రంగారావు, తాళ్ల రాజశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ మేళ్ల చెరువు సుమిత్ర కుమార్, రోటరీ క్లబ్ పబ్లిక్ ఇమేజ్ డైరెక్టర్ ఎస్.కె.జిలానీ మాలిక్, సెక్రెటరీ సాతులూరి శివకుమార్, ఆంధ్ర పల్స్ పోలియో రీజనల్ చైర్మన్ పులిపాటి రమేష్, పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ. ఆదినారాయణ, వారి సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పోలియో నిర్మూలన కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది పల్స్ పోలియో చుక్కలు టూ టైమ్స్ వేయటం జరుగుతుందని, చిన్నారుల భవిష్యత్తును కాపాడటానికి ప్రతి ఒక్కరు తమ బిడ్డలకు పోలియో డ్రాప్స్ వేయించాలని కోరారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్యశాల, పలుసెంటర్లలో ఏర్పాటుచేసిన పోలియో కేంద్రాలలో రెండు చుక్కలు పసిబిడ్డలకు వేసి నిండు జీవితానికి మార్గం చూపించాలని కోరారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు తమ బిడ్డలకు పోలియో డ్రాప్స్ తప్పనిసరిగా వేయించాలని, పసిబిడ్డలకు ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే తమకు అందుబాటులో ఉన్న వైద్యుల దగ్గరికి వెళ్లి సలహాలు,సూచనలు తీసుకోవాలని సూచించారు.